ప్రజాశక్తి

సోమవారం 10 జూన్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ప్రజాస్వామ్యంలో సైన్సుపాత్ర కీలకం

జెవివి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజాస్వామ్యంలో సైన్స్ పాత్ర ఎంతో కీలకమని, తాత్విక భావనగా సైన్స్‌ను ప్రజలలోకి తీసుకువెళ్లాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం. గేయానంద్ తెలిపారు. ఒంగోలు ఎల్‌బిజి భవన్ లో జనవిజ్ఞాన వేదిక -4 జిల్లాల జోనల్ స్థాయి వర్క్ షాప్ జెవివి జిల్లా అధ్యక్షుడు మండ్లా శ్రీనివాసులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ విశ్వం ఆవిర్భావం, మనిషి పుట్టుక, సమాజ నిర్మాణం వంటి వాటిపై సమాజంలో అవగాహన కలిగించేందుకు కషి చేయాలన్నారు. బాల్యంలోనే శాస్త్రీయ దక్పథాన్ని బాలల మనసులకు అందివ్వాలన్నారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ సైన్స్ ఉద్యమంలో పని చేసేందుకు కొత్త కార్యకర్తలు కావాలన్నారు. వారిని తయారు చేసుకునే బాధ్యత ఇప్పుడున్న నాయకులదేనని గుర్తు చేశారు. జిల్లా గౌరవ సలహాదారులు ఎవి.పుల్లారావు మాట్లాడుతూ పాలకులు ఎవరు గెలిచినా పదే పదే ఒడిపోతుంది ప్రజలేనని తెలిపారు. సైన్స్ దక్పథం లేని పాలన అభివద్ధిని సాధించలేదన్నారు. రాజ్యాంగం లోని 51 ఎహెచ్ ప్రకారం దేశంలో శాస్త్రీయ దక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించే ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. ఆ దిశగా విద్యావంతులు కషి చేయాలన్నారు. జెవివి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సైన్స్ సాధించిన ప్రగతి సమాజ సమిష్టి కషి అని తెలిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతి ఫలాలు ప్రజలందరికీ చెందినప్పుడు దేశం అభివద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల జెవివి నాయకులు డాక్టర్ కాలేషా, సిహెచ్.జయ ప్రకాష్, దార్ల బుజ్జిబాబు, వి. మాల కొండారెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, యు.భాస్కర్, బి. తిరుపతయ్య, కె.కష్ణారెడ్డి, మాదాల రాము, తంగా శ్రీనివాస్, ఎస్‌కె. షీరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

అంతా ఆశావహులే..

- మంత్రిపదవి రేసులో ముందున్న గొట్టిపాటి
- దామచర్ల..స్వామి..ఏలూరి..అనగాని ఆశలు
- చంద్రబాబు మదిలో

ఎవరున్నారన్నదానిపైనే పార్టీలో ఉత్కంఠ



ఎమ్మెల్యే గొట్టిపాటి



ఎమ్మెల్యే దామచర్ల



ఎమ్మెల్యే అనగాని



ఎమ్మెల్యే ఏలూరి



ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

నిన్నటి వరకూ ఫలితాల కోసం ఎదురు చూపులు. ఆ పర్వం ముగిసింది.కూటమి పాలన వచ్చేసింది. ఇపుడు మంత్రి పదవి కోసం ఎదురు చూపులు తప్పడంలేదు. ఈనెల12న చంద్రబాబు గన్నవరం సమీపంలో సిఎంగా ప్రమాణం చేయనున్నారు. ముహూర్తం ఖరారైన సంగతి తెలిసిందే. ఆయనతోపాటు మంత్రులూ ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అయితే మంత్రివర్గంలో ఎవరికి బెర్తు దొరుకుతుందనేదానిపైనే అందరిదృష్టి పడింది. అందరూ ఆశావహులుగానే కనిపిస్తున్నారు. అందరికీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఏదో ఒక కోటాలో అవకాశం వస్తుందనే భావనలో ఉన్నారు. అధినేత చంద్రబాబు మదిలో ఎవరున్నారన్నదీ స్పష్టతలేదు. జిల్లానేతలూ పలువురు ఆశగానే ఉన్నారు. ఆచితూచి ఇపుడు కేబినెట్‌ను సెట్ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. భారీగా గెలవడంతో అందరికీ ప్రాధాన్యత ఇవ్వాల్సిఉంది. అన్ని కోణాల్లో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఐదుసార్లు గెలిచిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రాధాన్యతల్లో ముందున్నారు. ఆయన పేరే ఉమ్మడి జిల్లా నుంచి ప్రసార మాద్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. మార్టూరు నుంచి ఒకసారి,అద్దంకి నుంచి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. ఆయన రాజకీయ ప్రస్థానం గురించి ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జిల్లాలో పార్టీ బాధ్యతలు కష్టకాలాల్లోనూ భుజాన వేసుకుని నడిపించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కూడా ఆశావహుల్లో ఉన్నారు. ఆయన కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో మహానాడు నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. లోకేష్ పాదయాత్ర విజయవంతం కావడంలోనూ దామచర్ల తనదైన పాత్ర, నాయకత్వ పాత్ర నిర్వహించారు .ప్రతి పక్షంలో ఉన్నపుడు జిల్లా కేంద్రంలో ▶ 2లో

ఇసుకాసురులు

- అదునుచూసి అక్రమ రవాణా
- నిత్యం వందలాది ట్రక్కుల ఇసుక, మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



వేటపాలెం వద్ద నిల్వ చేసిన ఇసుక కుప్పలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు రేపోమాపో ప్రయాణం చేయనున్నారు. అధికారులు బిజిబిజిగా ఉన్నారు. ఈ అవకాశాన్ని ఇసుకాసురులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సందట్లో సడేమియా అన్నట్లుగా తీరప్రాంతాల నుంచి యధేశ్చగా ఇసుక అక్రమంగా తరలించి నిల్వ చేసుకుంటున్నారు. కొందరు ఇసుక అమ్ముకొని తమ జేబులు నింపుకుంటున్నారు. గత రెండు నెలలుగా అధికార యంత్రాగం ఎన్నికల పనుల్లో నిమగ్నమై ఉన్నారు. పోలింగ్, కౌంటింగ్ ముగిసి జిల్లా అధికారులు విరామంలో ఉన్న ఈ సంధికాలంలో వీలైనంత మేర ఇసుక అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం వందలాది ట్రక్కుల్లో ఇసుక, నల్లమట్టి ఇతర ప్రాంతాలకు తరలిపోతుంది. కొత్త ప్రభుత్వంలో అధికారులు ఎక్కువ శాతం మంది బదిలి అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు కూడా పట్టినట్లుగా ఉన్నారు. దీంతో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల నుంచి పెద్దఎత్తున ఇసుక రవాణా జరుగుతోంది. బాపట్ల-ఒంగోలు 216 జాతీయ రహదారి అంతా ట్రక్కుల నుంచి జారి పడిన ఇసుకతో నిండి ఉంది. గత ఐదేళ్ళుగా అధికార అండతో వైసిపికి చెందిన ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు ఇసుకను అక్రమ రవాణా చేశారు. జిల్లాలో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో మాత్రమే రెండు చోట్ల ఇసుక సేకరణకు అనుమతి ఉంది. నియోజకవర్గాల వారీగా పలు చోట్ల ఇసుక డంపులు ఏర్పాటు చేశారు. సముద్ర తీరప్రాంతంలోని ఇసుకను ఈ డంపులకు తరలించారు. అదేవిధంగా కృష్ణానది ఒడ్డు నుంచి ఇసుకను తరలించారు. ప్రస్తుతం చాలా చోట్ల ఉన్న ఇసుక నిల్వలను తరలిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో విధుల్లో ఉన్న రెవెన్యూ, పోలీస్,భూగర్భ గనుల శాఖల అధికారులు వైసిపి ప్రభుత్వం హయాంలో ఉన్నవారే. దీంతో తమకున్న పరిచయాలతో ఇసుకను తరలిస్తున్నాయి. చీరాల, వేటపాలెం, బాపట్ల, కర్లపాలెం, పిట్టవానిపాలెం మండలాల్లోని పలు ప్రాంతాల నుంచి ఇసుక, నల్లమట్టి తరలిస్తున్నారు. కాలువలు, డ్రైన్ల కట్టలు, ఇసుక, మట్టి దిబ్బలు, చెరువుల ▶ 2లో



సాగులో ఉన్న మల్లెతోట, (ఇన్‌సెట్‌లో) మల్లెపువ్వులు

సిరులు కురుపిస్తున్న 'మల్లె'

- లాభసాటిగా మారిన మల్లెసాగు
- కూలీలకు ఉపాధి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మల్లెసాగు సిరులు కురిపిస్తోంది. ఓ యువ రైతు తన కున్న ఆసక్తితో మల్లె సాగు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నాడు.

యర్రగొండపాలెం మండలం వెంకటాద్రి పాలెంకు చెందిన మల్లయ్య నాయుడు 2018లో సరదాగా మధురై వెళ్లాడు. అక్కడ మల్లె మొక్కలు కనిపించాయి. ఒక్కో మొక్క రూ. మూడు చొప్పున మొత్తం 1500 మొక్కలు (అంట్లు) కొనుగోలు తీసుకొచ్చాడు. ఎకరా పొలంలో ఎటు చూసినా ఒక్కొక్క మొక్కకు ఐదు అడుగుల దూరం ఉండేలా పాదులు చేసి మొక్కలు నాటారు. మొక్కల అమ్మకందారులు చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ నీటి తడులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాడు. దీంతో మొక్కలు నాటిన ఏడాడి నుంచే పూత వచ్చింది.

ముప్పై ఏళ్ల వరకూ దిగుబడి

మధురై రకం మల్లె మొక్కలు ఒకసారి నాటితే ముప్పై ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతు నలగాటి మల్లయ్య నాయుడు తెలిపారు. ఏటా మార్చి నుంచి మల్లె పూలు కోతకు ▶ 2లో

కబ్జాదారుడి చెర నుంచి భూముల స్వాధీనం

ఎమ్మెల్యే స్వామి సహకారంతో ఐక్యంగా సత్తా చాటిన దళిత మహిళలు

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని పెట్లూరు పంచాయతీలోని సర్వే నెంబరు 450లో ఉన్న ప్రభుత్వ భూమిని ఎస్సీలకు నివాస స్థలాల కోసం గత ప్రభుత్వంలో మంజూరు చేసి పట్టాలు ఇవ్వగా అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, రౌడీ షీటర్ కల్లూరి హరిబాబు వారిని బెదిరించి భూమి ఆక్రమించుకున్నాడు. అప్పటి నుంచి ఎస్సీ మహిళలు నిత్యం అధికారుల చుట్టూ తిరుగుతూ పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుతం టిడిపి గెలుపొందడంతో ఎమ్మెల్యే స్వామి సహకారంతో తిరిగి తమ భూములను స్వాధీనపరుచుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి సమీపంలో ఎంపి స్కూల్ పక్కనే ప్రభుత్వ భూమిలో చింతతోపు ఉండేది. అది గ్రామానికి చెందిన కొంత మంది రైతుల ఆధీనంలో ఉండేదని తెలిపారు. ఎస్సీ కాలనీలో నివాస స్థలాలకై ఇబ్బందులు పడుతుండగా ఆనాటి టిడిపి ప్రభుత్వం హయాంలో ఎస్సీలకు సుమారు 50 మందికి పైగా నివాసస్థలాలు ఇచ్చారు. ఇందుకు ఆ భూమి



స్థలాన్ని స్వాధీనం చేసుకొని పాకలు వేసుకున్న పెట్లూరు ఎస్సీ కాలనీవాసులు

ఆధీనంలో ఉన్న రైతులు కూడా ఎస్సీలకు నివాసస్థలాలు ఇవ్వడానికి కూడా అంగీకరించారు. తదనంతరం వైసిపి పాలన రావడంతో అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, రౌడీ షీటరు కల్లూరి హరిబాబు.. ఎస్సీలకు కేటాయించిన ఆ భూమిని వారిని బెదిరించి బలవంతంగా ఆక్రమించి వ్యవసాయ భూమిగా సాగు చేసుకుంటున్నాడు. బాధిత ఎస్సీ ప్రజలు తమ భూమి తమకు ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. కోర్టును ఆశ్రయించగా ఎస్సీలకు కేటాయించిన భూమిలోకి వెళ్లరాదని కోర్టు ఆదేశాలను జారీ చేసింది. అయినా కోర్టు ఆదేశాలను పక్కకు నెట్టి ఆ భూమిని కబ్జాదారుడు యథేచ్ఛగా సాగు చేస్తున్నాడు. అప్పటి తహశీల్దారుకు భారీగా ముడుపులు అప్పగించి ఆ భూమిని తన పేరు మీదకు మార్చుకున్నాడు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిడిపి నాయకులు మూలె కోటేశ్వరరావు, బొల్లినేని నరసింహం, గుజ్జుల శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు, మహిళలు దాదాపు 100 మందికి పైగా భూమిలోకి ప్రవేశించి వారికి కేటాయించిన నివాస స్థలాలలో పాకలు వేశారు. ఎస్సీ కాలనీవాసులు మాట్లాడుతూ ప్రస్తుతం తాము ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు వారు కాపురాలు ఉంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే స్వామి తమకు ఇళ్ల మంజూరు చేస్తే వెంటనే ఆ భూమిలో పక్కా రోడ్డు వేసుకొని నివాస గృహాలు నిర్మించుకుంటామని వారు తెలిపారు.

అంతా ఆశావహులే...

(మొదటిపేజీ తరువాయి)

అన్నీ తానై ముందుకు సాగారు. కొండపి నుంచి హాట్రిక్ కొట్టిన డోలా వీరాంజనేయస్వామి రేసులో ఉన్నారు. ఆయన ప్రస్తుతం హాట్రిక్ కొట్టిన మొదటి దళిత ఎమ్మెల్యేగా ఉన్నారని సమాచారం. ఆయన కూడా తనకు అన్ని విధాలా అర్హత ఉందని భావిస్తున్నారు. ఇంకా పర్చూరు నుంచి హాట్రిక్ సాధించిన ఏలూరి సాంబశివరావు బాపట్ల జిల్లా పార్టీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా విభజన జరిగాక బాపట్ల జిల్లాలో పార్టీ అభ్యర్థుల విజయం కోసం ఆయన కృషి ప్రత్యేకంగా ఉంది. బీసీల కోటాలో పదవి దక్కుతుందని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కూడా ప్రయత్నాల్లో ఉన్నారు. ఆయన కూడా హాట్రిక్ విజయం సాధించారు. చంద్రబాబు వద్ద ఎవరికి ఎక్కువ మార్కులు ఉన్నాయన్నదే చూడాలి. రేపో మాపో జాబితా సిద్ధం కానుంది. 11వ తేదీ సాయంత్రానికి మంత్రుల జాబితా సిద్ధమవుతుంది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి ఒకరికి అవకాశం ఉంటుందా? లేక ఇద్దరికి పదవులు దక్కుతాయా? అనేది చూడాలి.

సిరులు కురిపిస్తున్న 'మల్లె'

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్నట్లు తెలిపారు. ఎనిమిది నెలల పాటు నిత్యం దిగుబడి ఉంటుందన్నారు. ఒక మొక్క నుంచి రోజుకు 200 నుంచి 300 గ్రాముల మల్లె పూల దిగుబడి వస్తున్నట్లు తెలిపారు. సీజన్ బట్టి కిలో మల్లెపూలకు రూ. 100 నుంచి రూ.350 వరకు ధర లభిస్తుందన్నారు. నెలకు సగటున తోట పని కోసం రూ. పది వేల మేర పెట్టుబడి అవుతున్నట్లు తెలిపారు. ప్రతిఏటా ఏటా రూ.50 వేల ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. పూలను కోసేందుకు నిత్యం నలుగురు నుంచి ఆరుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.

తోటను కంటికి రెప్పలా..

మల్లె మొక్కలు బలంగా ఉండేందుకు, నాణ్యమైన దిగుబడి వచ్చేందుకు జింక్ సల్ఫేట్, మెగ్నీషియం సల్ఫేట్ వినియోగి స్తున్నట్లు నలగాటి మల్లయ్య నాయుడు తెలిపారు. తోటకు వారానికి ఒకసారి నీరు పెడుతున్నట్లు చెప్పారు. పురుగు ఆశిస్తే మల్లెపువ్వులు గులాబీ రంగులోకి మారు తుంటాయన్నారు. పురుగుల నివారణకు అధికారుల సూచన మేరకు ఐదవ్వై లీటర్ల నీటికి యాభై మిలీ కోరోక్రాన్ మందు పిచికారీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

మల్లెసాగుతోనే జీవనం



నలగాటి మల్లయ్య నాయుడు, రైతు, వెంకటాద్రిపాలెం

సరదా కోసం మధురై వెళ్లి ఆశక్తి కొద్ది మదురై మల్లె మొక్కలు తెచ్చి నాటాను. వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటు న్నాను. ఐదేళ్ల నుంచి పంట దిగుబడి వస్తోంది. ఆ నగదుతోనే కుటుంబాన్ని పోషించ కుంటున్నాం. మరో నలుగురు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాను. అందరూ నన్ను మల్లెపూల మల్లయ్య అంటుంటే సంతోషంగా ఉంది.



దామచర్లను సత్కరిస్తున్న కోలా ప్రభాకర్

ఎమ్మెల్యే దామచర్లకు సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందాలంటే ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావుకు మంత్రి పదవి ఇవ్వాలని కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, టిడిపి నాయకుడు కోలా ప్రభాకర్ కోరారు. దామచర్లను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబాటుకు గురైన ప్రకాశం జిల్లా అభివృద్ధి చెందాలంటే దామచర్ల జనార్దనరావుకి మంత్రి పదవి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

ఇసుకాసురులు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక మట్టిని తరలిస్తున్నారు.

రంగంలోకి దిగిన పాతకాపులు

వైసిపి ప్రభుత్వ హయాంలో ఇసుక రవాణాలో ఆరితేరిన వారితో పాటు టిడిపి జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో చీరాల నియోజకవర్గంలో జనసేనకు చెందిన పాత కాపులు చినగంజాం మండల నుంచి శాంపిల్గా ఇసుక అక్రమ రవాణాను ప్రారంభించారు. గతంలో చీరాల, వేటపాలెం, చినగంజాం ప్రాంతాల్లో దశాబ్దాల కాలం పాటు కోట్ల రూపాయల విలువైన ఇసుకను అమ్మి సొమ్ము చేసుకున్న వారు తిరిగి కడవకుదురు కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. పట్టించుకునే వారే లేకపోవడంతో ఇసుక రవాణా పెద్దఎత్తున సాగుతోంది.

పట్టించుకోని అధికారులు

కోర్టు ఆదేశాల మేరకు మే నుంచి బాపట్ల జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా , ఎస్పి వకుల్ జిందాల్ ఇతర శాఖల అధికారులు కృష్ణానది, గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాల వద్ద ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. రేపల్లె నియోజకవర్గంలోని కొల్లూరు మండలం జువ్వలపాలెం, గాజులలంక, పెద్దలంక ఇసుక రేవులను, పెనుమూడి వద్ద ఇసుక లభ్యమయ్యే ప్రాంతాలను పరిశీలించారు. అద్దంకి నియోజకవర్గంలోని గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతం ఇసుక రేవులను పరిశీలించారు. కృష్ణానది, గుండ్లకమ్మ నది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు జరగడానికి వీలు లేదని తెలిపారు. అక్రమ ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేయాలని అధికారులను హెచ్చరించారు. ఇసుక రేవుల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. చెక్ పోస్ట్లు ఏర్పాటు సూచించారు. అక్రమంగా ఇసుక రవాణాపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తునట్లు ఆరోపణలు వస్తే పోలీస్, సెబ్ అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినప్పటికీ గత నెల రోజులుగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు.

వర్షం పట్ల రైతుల హర్షం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం:

యర్రగొండపాలెం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయం త్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాటికే రైతులు ఖరీఫ్ సాగు కోసం పొలాలను దుక్కి దున్నే పనుల్లో నిమగ్న మయ్యారు. ఇదే సమయంలో వర్షం కురవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరి సింది. పంటల సాగుకు అనుకూలంగా వర్షం కురిసిందని, పొలాలను దుక్కి చేసుకోవడానికి అవకాశం ఏర్పడిందని రైతులు పేర్కొన్నారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు బోరుబావులు రీచార్జ్ అయ్యే అవకాశం ఉందని



యర్రగొండపాలెంలో కురుస్తున్న వర్షం

రైతులు అంటున్నారు. ఏది ఏమైనా ఖరీఫ్లో వరుణుడు కరుణించడంతో రైతుల్లో సంతోషం కనిపిస్తోంది.

ఎఎస్ఐకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఎస్ఐగా ఉద్యోగోన్నతిపై బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యాడు. అందులో భాగంగా ఆదివారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు రెండు సంవత్సరాలుగా ఎఎస్ఐగా అంకిత భావంతో విధులు నిర్వహించి మండల ప్రజలు, పోలీసు సిబ్బంది మన్ననలు పొందారన్నారు. అనంతరం శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతో స్వర్ణయుగం

-గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం
- టిడిపి నాయకుడు దామచర్ల సత్య

ప్రజాశక్తి-కొండపి

రాబోయే 5 సంవత్సరాలలో ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబునాయుడు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సువర్ణయుగాన్ని చూడబోతున్నదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య తెలిపారు. మండలంలోని గుర్రపడియ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మారెడ్డి సుబ్బారెడ్డి, అబ్బిరెడ్డి, గ్రామ నాయకులు కలిసి తెలుగుదేశం పార్టీ అధికారంలోని వచ్చిన సందర్భంగా విద్యుత్ ప్రభను మండలంలోని జాళ్లపాలెం గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దగ్గర ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ గుర్రపడియ గ్రామంలో ఎప్పుడూ వైసిపి జెండా ఎగరవేస్తుంటారు. అలాంటి గ్రామంలో మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఆ టిడిపికి 60 ఓట్ల ఆధిక్యం వచ్చింది.



జాళ్లపాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై మాట్లాడుతున్న దామచర్ల సత్య

ఈ సందర్భంగా వారు విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి తనను ఆహ్వానించారన్నారు. 2029 ఎన్నికలలో కూడా ఈ గ్రామంలో ఇంకా భారీ మెజార్టీ వచ్చే విధంగా ఆ గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకొనిపోయే విధంగా నాయకులు కృషి చేయాలని అన్నారు. మన కొండపి నియోజకవర్గం సుఖ శాంతులతో అభివృద్ధి పథంలో నడిచే విధంగా దామచర్ల కుటుంబం ముందు ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే స్వామికి భారీ మెజారిటీ రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి, కూటమి నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బి యలమందనాయుడు, మాజీ ఏఎంసి చైర్మన్ జి రామయ్యచౌదరి, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, పెదకండ్లగుంట మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కల్లూరి మల్లికార్జునరావు, భూమా రెండో కోటయ్య, మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024

తాగునీటి వ్యథ.. రూ.కోట్లు వృథా..

యర్రగొండపాలెం ప్రాంతంలో దాహం కేకలు • పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రాంతంలో తాగునీటి కష్టాలు తీరడం లేదు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గుర్తించిన పాలకులు, అధికారులు రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలు మూలన పడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటి పోగా, మరోవైపు అర కిలోమీటరు దూరానికి వెళ్లి నీటిని తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో ప్రజలు నీటి కోసం పాట్లు పడుతున్నారు.

– పుల్లలచెరువు మండలంలోని ముటుకుల సమీపంలో సాగర్ కాలువపై మంచినీటి పథకాన్ని గత 20 ఏళ్ల క్రితమే రూ.16 కోట్లు ఖర్చుపెట్టి నిర్మించారు. దాని మరమ్మతుల కోసమంటూ మరో రూ.15 కోట్లు ఖర్చు చేశారు. ప్రతి యేటా మెయింటెనెన్స్ ఖర్చుల కోసం రూ.కోటి దాకా ఖర్చు చేస్తూనే ఉన్నారు. ఈ మంచినీటి పథకం ద్వారా పుల్లలచెరువు మండలంలోని 36, యర్రగొండపాలెం మండలంలోని ఒక గ్రామానికి, త్రిపురాంతకం మండలంలోని మూడు గ్రామాలకు సాగర్ నీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే పైపులు లీక్ కావడం, నిత్యం ఫిల్టర్ బెడ్లు మరమ్మతులకు గురై పట్టుమని పది గ్రామాలకు కూడా నీటి సరఫరా జరగడం లేదు. దీంతో ముటుకుల మంచినీటి పథకం పరిధిలోని గ్రామాలలో నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– 2004లో త్రిపురాంతకం మండలంలోని దూపాడు వద్ద సాగర్ కాలువపై రూ.20 కోట్లతో మంచినీటి పథకాన్ని నిర్మించారు. దాని మరమ్మతులకు ఇప్పటిదాకా మరో రూ.50 కోట్ల వరకూ ఖర్చు చేశారు. మెయింటెనెన్స్ ఖర్చుల కోసం ప్రతియేటా రూ.కోటికి పైగా ఖర్చు చేస్తున్నారు. దాని పరిధిలో 55 గ్రామాలకు నీటి సరఫరా జరగాల్సి ఉంది.


నిరుపయోగంగా ఓవర్ హెడ్ ట్యాంకు

అలాగే యర్రగొండపాలెం మండలంలో 16 గ్రామాలకు నీటి సరఫరా జరగాల్సి ఉండగా ఐదు గ్రామాలకు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. త్రిపురాంతకం మండలంలో ఐదు గ్రామాలకు, పెద్దారవీడు మండలంలో 18 గ్రామాలకు నీటి సరఫరా జరగాల్సి ఉండగా 13 గ్రామాలకు మాత్రమే మూడు నాలుగు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్నారు. దోర్నాల మండలంలో ఏడు గ్రామాలకు నీటి సరఫరా చేయాల్సి ఉండగా ఒక్క గ్రామానికి కూడా సరఫరా కావడం లేదు.


ముటుకుల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

అడుగంటిన భూగర్భ జలాలు

గ్రామాల్లో డీప్‌బోర్లు, చేతి పంపులు ఉన్నప్పటికీ భూగర్భ జల మట్టం పడిపోయి అవి మొరాయిస్తున్నాయి. అదనపు పైపులు దించినా పని చేయడం లేదు. దీంతో గత్యంతరం లేక రెండు, మూడు కుటుంబాల వారు కలిసి రోజుకు ఒక ట్యాంకర్ చొప్పున నీటిని కొనుగోలు చేసుకొని వాడుకుంటున్నారు. పశు పోషకులు అయితే ఒక్కో ట్యాంకర్ నీటిని రెండు రోజులకు ఒకసారి కొనుగోలు చేసి ఆ నీటిని పొదుపుగా వాడుకుంటున్నారు. ప్రస్తుతం ట్యాంకర్ రూ.900 పలుకుతోంది. ఫలితంగా పేదలకు నీటి కష్టాలు తప్పడం లేదు. పొలం బాట పట్టి వ్యవసాయ బోర్ల దగ్గర బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నారు. మరికొందరు సైకిళ్లపై బిందెలు పెట్టుకొని తెచ్చుకుంటున్నారు.


ఫిల్టర్ బెడ్లు


ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

అరకొర ట్యాంకర్లతో అవస్థలు

గతంలో వేసవి సమీపిస్తున్న తరుణంలో ఏయే ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందని గుర్తించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేసే వారు. ఆ గ్రామంలోని జనాభా ప్రాతిపదికన రెండు పూటలా నీటిని సరఫరా చేసేవారు. గత ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం మానేశారు. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. తాగునీటి కోసం గ్రామ సమీప ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల నేల బావి, బోర్లు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అరకొరగా ట్యాంకర్లను ఏర్పాటు చేసినా అవి ఏ మూలకూ సరిపోవడం లేదని వాపోతున్నారు. ఎన్నికల సీజన్‌లో ఇరుపార్టీల నాయకులు పోటీలు పడి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. పోలింగ్ ముగిసిన నాటి నుంచే ట్యాంకర్లు నిలిపివేశారని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నీటికి కష్టాలు పడుతున్నాం
ముండ్లా దానియేలు, గుర్రపుశాల



నీటి కోసం నిత్యం కష్టాలు పడుతున్నాం. గ్రామంలో డీప్‌బోర్లు ఎండిపోయాయి. చేతి పంపులు మరమ్మతులకు గురయ్యాయి. ట్యాంకర్ల ద్వారా తోలే నీళ్లు సరిపోవడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.పది కోట్లతో నిర్మించిన మంచినీటి పథకం ప్రారంభించిన మరుసటిరోజే మరమ్మతులకు గురైంది. మంచినీటి సమస్య పరిష్కరించకపోతే వలసబాట పట్టక తప్పదు.

నీటిని సరఫరా చేయాలి
టంగుటూరి సత్యనారాయణ, సిపిఎం నాయకులు, యర్రగొండపాలెం



తాగునీటి పథకాలు పని చేయడం లేదు. ప్రతి వేసవిలోనూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అధికారులు చొరవ చూపి గ్రామాలకు సరిపోయినన్ని నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలి. నీటి ఇబ్బంది తీర్చాలి.


నివాళి అర్పిస్తున్న బడుగు వెంకటేశ్వర్లు తదితరులు

చెన్నయ్యకు నివాళి

ప్రజాశక్తి-పిసిపల్లి

వ్యవసాయ కార్మిక సంఘం పిసి పల్లి మండల నాయకులు ఉన్నం చెన్నయ్య శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, పిసి పల్లి మండల నాయకులు బడుగు జనార్ధన్ ఆదివారం మురుగుమ్మి వెళ్లి చెన్నయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉన్నం చెన్నయ్య వ్యవసాయ కార్మిక సంఘంలో పది సంవత్సరాలుగా క్రియాశీలకంగా పనిచేశాడన్నారు. చెన్నయ్య మృతి ఉద్యమానికి తీరని లోటు అని బడుగు వెంకటేశ్వర్లు అన్నారు. వీరి వెంట ఆ సంఘం నాయకులు ఉన్నారు.

జేపిసి కన్వీనర్ పొల్లా రాజీనామా

ప్రజాశక్తి-వెలిగండ్ల


పొల్లా సుబ్రమణ్యం

వెలిగండ్ల మండలం జేపిసి కన్వీనర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు పొల్లా సుబ్రహ్మణ్యం ఆదివారం తన జేపిసి కన్వీనర్ పదవికి రాజీనామా చేశారు. మే 13వ తేదీన జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వెలిగండ్ల మండలంలో వైసిపికి మెజార్టీ తీసుకురావటంలో పూర్తిగా విఫలమైనందున మనస్తాపం చెంది నైతిక బాధ్యత వహించి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గత 2019 ఎన్నికల్లో వెలిగండ్ల మండలంలో వైసిపికి 5,600 పైగా మెజార్టీ వచ్చిందని, ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మెజార్టీ రావడంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా లేఖను జిల్లా జేపిసి కోఆర్డినేటర్ పుట్ట శివానందారెడ్డికి పంపించినట్లు ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం తెలిపారు. పార్టీలో సామాన్య కార్యకర్తగా క్రియాశీలంగా పని చేసి వైసిపి బలోపేతానికి రాబోయే రోజుల్లో కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

జనరేటర్ల నిర్వహణ పట్టించుకోరా?

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడితే కార్యాలయ పనులకు, ప్రజల సేవలకు అవసరమైన పనులకు ఆటకం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి జనరేటర్ల సదుపాయం కల్పించినా వాటి నిర్వహణను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా అవి అవసరానికి పనికిరాకుండా మొరాయిస్తున్నాయి. యర్రగొండపాలెంలోని తహశీల్దారు కార్యాలయానికి ఇచ్చిన జనరేటరు అలంకారప్రాయంగా మారింది. తుప్పుపట్టి పాడయ్యేందుకు సిద్ధంగా ఉంది. కార్యాలయ సిబ్బంది కంప్యూటర్లపై వివిధ నమోదులు, ధ్రువపత్రాల స్కానింగ్ తదితర పనులను చేసుకోవడానికి విద్యుత్తు లేనప్పుడూ ఇబ్బంది లేకుండా చేసేందుకు జనరేటర్‌కు సుమారు రూ.3 లక్షలు వెచ్చించారు. అవి ఎండకు ఎండి, వానకు తడిసే విధంగా కాకుండా తగిన రక్షణ చర్యలతో నిర్వహించాలి. ఆ కనీస జాగ్రత్తలైనా తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


నిరుపయోగంగా ఉన్న జనరేటర్

వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చే ప్రజలు కార్యాలయాల్లో వేచి ఉండక తప్పడం లేదు. అత్యవసర పరిస్థితిలో జనరేటర్ పని చేస్తుందా, లేదా అనేది సందేహమే. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనరేటర్‌ను వినియోగంలోకి తెచ్చి అది మరమ్మతులకు గురి కాకుండా చూసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి దుగ్గిరాల

మండలంలోని చింతలపూడి గ్రామంలో ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి కారుమూరి వంశీకష్ణ(24) ఆదివారం ఉదయం ఆత్మహత్యకు పాటుపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా పర్చూరు మండలం రమణాయపాలెం గ్రామానికి చెందిన వంశీకృష్ణకు బీటెక్ నాలుగో సంవత్సరం పూర్తి అయింది. అయితే గత నాలుగు సంవత్సరాలకు సంబంధించిన సబ్జెక్టులు ఇంకా మిగిలి ఉన్నాయి. దీనితో మిగిలిన సబ్జెక్టులు పూర్తి చేయడానికి పరీక్ష రాసే నిమిత్తం రెండు రోజుల క్రితం ఇక్కడికి వచ్చి స్నేహితులు కలిసి హాస్టల్లో ఉన్నట్లు తెలిపారు. చాలా సబ్జెక్టులు మిగిలి ఉన్నట్లు తెలిసినది.


ఆత్మహత్య చేసుకున్న వంశీకృష్ణ

దీంతో మనస్తాపం చెందిన విద్యార్థి కాలేజీ వెనుక భాగాన పొలాల్లో ఉన్న పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎఎస్ఐ అబ్దుల్ సత్తార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండల కేంద్రంలోని చెరువు కట్టపై కమ్మవారిపల్లికి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఆ రహదారిలో అనునిత్యం విద్యార్థులు, రైతులు, పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధాన రహదారి అయినప్పటికీ విద్యుత్ శాఖాధికారులు ఇలా రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ అధికారులు స్పందించి ప్రమాదం పొంచివున్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఎన్నికైన విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో సంఘ అధ్యక్షులు పొన్నపల్లి బ్రహ్మానందం అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా విభాగం పట్టణ కమిటీ అధ్యక్షురాలుగా సొలస లీలా కుమారిని నియమించారు. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ టిడిపి సాధికార కమిటీ కన్వీనర్ తువ్వపాటి జనార్ధనాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల్లో మహిళలను కూడా చైతన్యవంతులు చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు. నూతనంగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు, అద్దంకి ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు చెన్నుపల్లి కోటిలింగాచారి, చోడ వెంకట సుబ్బారావు, ఆళ్లగడ్డ వీర సుందరాచారి, ఏలూరు వీర బ్రహ్మాచారి పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట పంచాయతీ నీలకంఠ పురంలోని అనాథ ఆశ్రమం నందు టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. అఖండ విజయం సాధించిన చీరాల ఎంఎల్ఎ మద్దులూరి మాలకొండయ్యకు రాబోయే కేబినెట్‌లో మంత్రి పదవి రావాలని ఆశిస్తూ అన్నదానం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి నాసిక వీరభద్రయ్య, టిడిపి నాయకులు ధోగుపర్తి బాలకృష్ణ, జనసేన నాయకులు హర్ష, కిరణ్, తేజమణి, శివ, పిచ్చుక వెంకట సుబ్బారావు, గ్రంధి నాగంజనేయులు, జగదీష్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న అడ్వకేట్ కొల్లా నరేంద్రకుమార్

ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనం నందు ఫ్యాబ్రిక్ డిజైనింగ్, పెయింటింగ్ నిపుణులచే ఉచిత శిక్షణా శిబిరం సామాజిక వేత్త నర్రా లక్ష్మీసుధ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ సుధ మాట్లాడుతూ మహిళలకు ఎంతో ఉపయోగకరమై ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధికి దోహద పడగలదని తెలిపారు. ఎక్కువ మంది హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ అడ్వకేట్ కొల్లా నరేంద్ర కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదా నందరెడ్డి, రోటరీ సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, కుట్టు శిక్షణ నిపుణురాలు దగ్గుబాటి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచాలి

ప్రజాశక్తి - బాపట్ల



వేసవి శిక్షణా శిభిరం ముగింపు లో యుటిఎఫ్ కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు

బాల్యం దశ నుండి మూఢనమ్మకాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు అవగాహన కల్పించాని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాస రావు అన్నారు. పట్టణంలోని ఉప్పరపాలెంలో సిపిఎం, యుటిఎఫ్ సంయుక్తంగా వారం రోజులపాటు వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. శిక్షణ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి దశనుండే శాస్త్రీయ విజ్ఞానం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. మూఢనమ్మకాలతో కలిగి నష్టాలను విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రధానంగా విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని అన్నారు. తల్లి, దండ్రులను, గురువులను గౌరవించి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని అన్నారు. మూఢనమ్మకాలను పారుదోలి శాస్త్రీయ విజ్ఞానంతో సమాజ శ్రేయస్సుకు పాటుపడే దిశగా విద్యార్థులు మంచి నడవడిక కలిగి ప్రవర్తించాలని అన్నారు. సిపిఎం, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా బాలల వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులు పాటు నిర్వహించిన బాలల వేసవి శిక్షణ శిబిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, ఉపాధ్యాయులు పివి సాంబశివరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జడ వినయ్ కుమార్, ఉపాధ్యాయులు చక్రధర్, సిఐటియు నాయకులు శరత్, సిపిఎం ఉప్పరపాలెం శాఖ కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా చేయండి

సొసైటీ త్రిసభ్య కమిటీలకు సిఎస్ ఆదేశాలు

ప్రజాశక్తి - పంగులూరు

గ్రామాల్లోని వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రిసభ్య కమిటీ సభ్యులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా సొసైటీలకు అందుకు సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు తెలిసింది. గ్రామాల్లోని వ్యవసాయ పరపతి సంఘాలకు గత ఐదేళ్లుగా ఎన్నికలు జరగలేదు. అప్పటి అధికార పార్టీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి త్రిసభ్య కమిటీలను ఎంపిక చేసి సొసైటీ బాధ్యతలను అప్పగించింది. అప్పటి నుండి ఎన్నికలు లేక త్రిసభ్య కమిటీలతోనే సొసైటీలు నడుస్తున్నాయి. అయితే ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికలు జరిగి రాష్ట్ర ప్రభుత్వం మారటంతో సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఈ త్రిసభ్య కమిటీలను రద్దు చేస్తూ ఉత్తర్వులను ఇచ్చారు. అందుకనుగుణంగా సోమవారం ఆయా సొసైటీ కమిటీలు రాజీనామాలు చేయాల్సి ఉంది. సొసైటీలకు ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయాని చాలా కాలం నుండి రైతు నాయకులు, రైతులు ఎదురుచూస్తున్నారు. త్వరలోనే సొసైటీ ఎన్నికలు జరుగుతాయనేందుకు సిఎస్ ఆదేశాలు నిదర్శనమని పలువురు చెబుతున్నారు. ఏదేమైనా త్వరలో సొసైటీలకు ఎన్నికలు జరగవచ్చనే ఉత్సాహంలో రైతులు ఉన్నారు. ఎన్నికైన కమిటీలు లేకపోవడం వల్ల పంట కాలువల పర్యవేక్షణ లేక సకాలంలో సాగునీళ్ల అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా గ్రామాల్లో రైతులు పంటలు నష్టపోయిన సందర్భాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా తమ పరిస్థితులు మారతాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



రోటరీ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంగులూరులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరావు, కాలేషా వలి తెలిపారు. వీరిలో 70మందికి శుక్లముల ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. స్థానిక రోటరీ భవన్ దగ్గర ఆదివారం నిర్వహించిన వైద్య శిభిరంలో క్యాంపు ఇన్చార్జి చిలుకూరి వీరరాఘవయ్య మాట్లాడుతూ శుక్లముల ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన వారు సోమవారం రోటరీ భవన్ దగ్గరకు వస్తే అక్కడ నుండి ఉచిత బస్సు ఏర్పాటు చేస్తున్నామని, ఆ బస్సులో వెళ్లి ఆపరేషన్లు చేయించుకుంటే మరల ఇక్కడికి తీసుకు వస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ ద్వారా గత 17ఏళ్లుగా వేలాది మంది పేదలకు శుక్లంల ఆపరేషన్ చేయించి కంటి చూపు పొందేటట్లు చేయించామని చెప్పారు. ఈ కంటి పరీక్షలను ఆప్తమాలజీ ఆఫీసర్ ఎల్లారెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు ఇమ్మడిశెట్టి సుబ్బారావు, జాగర్లమూడి సుబ్బారావు (జెకెసి), పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.

ముండ్లమూరు : పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో విజయవాడ ఉన్నం చారిటబుల్ ట్రస్ట్, జిల్లా అంతత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో నిర్వహించారు. ఈ శిబిరానికి 620మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకోగా వారిలో 366మందికి శుక్లంల ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు నిర్ణయించారు. శంకర్ కంటి హాస్పిటల్‌లో ఆపరేషన్ చేసేందుకు సిఫార్సు చేశారు. హాస్పిటల్‌కు రిఫర్ చేయగా ఉన్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేతలు ఉన్నం నరసింహారావు, ఉన్నం రామాంజనేయులు, ఉన్నాం రాము దగ్గరుండి రోగులకు భోజనం ఏర్పాటు చేసి ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి ఉచితంగా కంటి అద్దాలను ఇవ్వనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉన్నం నాగేశ్వరరావు. శంకర్ కంటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ కంటి హాస్పిటల్ వైద్యులు



కుందుర్రు నుండి సింగరకొండ దర్శనానికి మహిళలు

శింగరకొండకు పాదయాత్ర

ప్రజాశక్తి - సంతమాగులూరు

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడంతోపాటు అద్దంకి నియోజకవర్గం ఎంఎల్ఎగా గొట్టిపాటి రవికుమార్ భారీ మెజార్టీతో ఐదో సారి విజయం సాధించినందుకు మండలంలోని కుందుర్రు గ్రామానికి చెందిన టిడిపి జిల్లా కార్య నిర్వాహక ఉపాధ్యక్షురాలు నాగబోతు సుజాత ఆధ్వర్యంలో కుందుర్రు, పరిటాలవారి పాలెం గ్రామాల మహిళలు పెద్ద సంఖ్యలో కొమ్మాలపాడు మీదుగా 35కిలోమీటర్లు దూరంలోని సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దర్శనానికి కాలినడకన బయలుదేరి వెళ్లారు. స్వామిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు. మార్గమధ్యలో మహిళలకు టిడిపి సంతమాగులూరు నాయకులు అట్లా పెద వెంకటరెడ్డి తమ సంఘీభావం తెలిపి పండ్లు అందజేశారు.




చర్చిల్లో మిఠాయిలు పంచుతున్న టిడిపి నాయకులు

అనగాని హ్యాట్రిక్ విజయం పట్ల హర్షం

ప్రజాశక్తి - రేపల్లె

ఎన్నికల్లో 400018 ఓట్ల ఆధిక్యంతో ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ హాట్రిక్ విజయాన్ని సాధించిన సందర్భంగా మండలంలోని పేటేరు గ్రామ టిడిపి నాయకులు రెబ్బా కోదండరాం స్థానిక నాయకులతో కలిసి ఆదివారం గ్రామంలోని అన్ని చర్చిల్లో ప్రార్ధన సమయంలో స్వీట్స్ పంచిపెట్టారు. పాస్టర్లు ఆయా చర్చిల్లో ఎంఎల్ఎ విజయాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ పేదల కోసం అనేక మౌలిక సదుపాయాలు కల్పించి వారి అభివృద్ధికి ఎంతో కృషి చేసింది టిడిపి ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం అమలు చేయటం టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ నాయకులు పుసులూరు కోటేశ్వరరావు, గోలి రామ శేషగిరిరావు, దీవి సురేష్, వెంకటేశ్వరరావు, డివిఎస్ఆర్ శాస్త్రి పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న నవతరం పార్టీ నాయకులు కరీం

బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

నవతరం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి షేక్ కరీం ఆధ్వర్యంలో 3వ వార్డు రాజీవ్ గాంధీ కాలనీలో పేదలకు ఆదివారం బియ్యం పంపిణీ చేశారు. పేదలకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. పేదల సంక్షేమానికి సహాయం అందించేందుకు ముందుంటామని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నవతరం పార్టీ కార్యకర్తలు ఎన్ గోపాల్, కె నరేంద్ర, పి సందీప్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి రేసులో డాక్టర్ 'ఉగ్ర'

ప్రజల నాడి తెలిసిన వైద్యుడికి ఆరోగ్యశాఖ దక్కనుందా? ● టిడిపికి కలిసొచ్చిన కనిగిరి శంఖారావ ప్రచార ప్రారంభ సభ

ప్రజాశక్తి-కనిగిరి

త్వరలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనుండగా ఆయనతోపాటు కొంతమంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అయితే ప్రకాశం జిల్లా నుంచి కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని మంత్రి పదవి వరిస్తుందని ప్రచారం జోరుగా సాగుతోంది. డాక్టర్ ఉగ్ర మంత్రి రేసులో ఉన్నారని, ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు ఎన్నో అంశాలు కలిసి వచ్చాయని విస్తృతంగా చర్చ సాగుతోంది.

టిడిపికి కలిసొచ్చిన కనిగిరి శంఖారావ సభ


తెలుగుదేశం పార్టీకి కనిగిరిలో నిర్వహించిన రా.. కదలిరా ఎన్నికల సమర శంఖారావం ప్రారంభ సభ కలిసొచ్చి అద్భుత విజయాన్ని అందించింది. ఈ సభను విజయవంతం చేయడంలో కనిగిరి టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేసిన కృషి ఫలించింది. ఈ ప్రచార సభ నింపిన ఉత్సాహం రాష్ట్రవ్యాప్తంగా ఒక ఊపు ఊపింది. టిడిపి అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి వచ్చింది. కనిగిరిలో ప్రారంభించిన ఎన్నికల సమర శంఖారావం సభ కనిగిరి నియోజకవర్గ ప్రజల్లోనూ ఉత్సాహాన్ని నింపింది. ఫలితంగా కనిగిరి టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి విజయాన్ని కట్టబెట్టేందుకు ఈ ప్రచార ప్రారంభ సభ ఎంతగానో దోహద పడింది. డాక్టర్ ఉగ్ర సూపర్ ఫైవ్ పథకాలను నెరవేర్చాలని కోరగా టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అడిగిందే తడవుగా కనిగిరిని కనకగిరిగా మార్చే సూపర్ ఫైవ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ హామీ ఇచ్చారు. డాక్టర్ ఉగ్ర కోరిన సూపర్ ఫైవ్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలు కనిగిరి ప్రాంత ప్రజలు మరింత ఆకర్షితులయ్యేలా చేశాయి. ఇటు కనిగిరిలోనూ అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొత్తంలోనూ తెలుగుదేశం పార్టీ విజయం నల్లేరు మీద నడకలా సాగేలా చేసింది. ఇక టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతంగా సాగింది. ఈ యాత్ర కనిగిరికి చేరుకున్నప్పుడు, విజయనగరం జిల్లాలో జరిగిన ముగింపు సభ విజయవంతంలో డాక్టర్ ఉగ్ర చూపిన ప్రత్యేక చొరవ, ఉత్సాహం నారా చంద్రబాబు నాయుడు, లోకేష్‌లకు మరింత దగ్గరయ్యేలా చేసింది. తెలుగుదేశం పార్టీ తీసుకువచ్చిన ఏ కార్యక్రమమైనా సరే రాష్ట్రస్థాయిలో కనిగిరికి ప్రత్యేక గుర్తింపు వచ్చేలా డాక్టర్ ఉగ్ర కృషి చేసి అధినాయకుడు చంద్రబాబు, యువ నాయకుడు లోకేష్ మదిలో స్థానం సంపాదించారు.



కనిగిరిలో ఎన్నికల సమర శంఖారావాన్ని ప్రారంభిస్తున్న నారా చంద్రబాబు నాయుడుతో డాక్టర్ ఉగ్ర (ఫైల్)



లోకేష్ యువగళం పాదయాత్ర సభలో లోకేష్‌తో డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి (ఫైల్)



డాక్టర్ ఉగ్ర

వైద్య ఆరోగ్య శాఖ దక్కనుందా?

ప్రజల నాడి తెలిసిన వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పదవి వరిస్తుందని ప్రచారం జోరుగా సాగుతోంది. నారా లోకేష్ పాదయాత్ర కనిగిరికి చేరిన సమయంలో డాక్టర్ ఉగ్రకు మంత్రి పదవి కేటాయించేందుకు హామీ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ ఆదరాభిమానాన్ని చూరగొన్న డాక్టర్ ఉగ్రకు మంత్రి పదవి దక్కేందుకు మెండుగా అవకాశాలు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

రెడ్డి సామాజిక కోటాలో దక్కనున్న మంత్రి పదవి

ప్రకాశం జిల్లాలో రెడ్డి సామాజిక వర్గానికి మంత్రి పదవి కేటాయించేటట్లయితే ఆ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలలో అధినాయకుల అండదండలు ఎక్కువగా ఉన్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి మంత్రి పదవి దక్కేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందని చర్చ సాగుతోంది. ఏది ఏమైనప్పటికీ వెనుకబడిన కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే శాసనసభ్యులు డాక్టర్ ముక్కు నరసింహారెడ్డికి మంత్రి పదవి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కనిగిరి ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. అధినాయకుల మనసు గెలిచిన డాక్టర్ ఉగ్రకు మంత్రి పదవి దక్కుతుందా లేదా అనేది కొద్దిరోజుల్లో తేలనుంది.



ముత్తుములను సన్మానిస్తున్న విఆర్‌వోల సంఘ నాయకులు

'ముత్తుముల'కు సన్మానం

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని జిల్లా విఆర్‌వోల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షులు వైపీ రంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరామయ్య కలిసి ఆదివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో వీఆర్‌వోలు నాగేంద్ర, ఈశ్వర్‌రెడ్డి, అక్బర్‌వలి, రమణ, అచ్చయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బీఎన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అపుస్మా నాయకులు

ఎమ్మెల్యే బీఎన్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు ఎమ్మెల్యేగా అపూర్వ విజయం సాధించిన బీఎన్ విజయ్‌కుమార్‌ను ఎస్‌ఎన్ పాడు నియోజకవర్గ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్లు ఆదివారం ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీఎన్ వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏవి సుబ్బారావు, అపుస్మా జిల్లా జనరల్ సెక్రటరీ బొడ్డు హనుమంతరావు, ఎస్‌ఎన్ పాడు నియోజక కార్యదర్శి గుంటూరు ప్రసాద్, గురుదత్త స్కూల్ సీతారామాంజనేయులు, రుద్రవరం కోటేశ్వరరావు, జగదీష్, సాయి తదితరులు ఉన్నారు.



మురుగు నీరు నిల్వ ఉన్న గుంటలకు తోలిన గ్రావెల్

మురుగు నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

ప్రజాశక్తి కథనానికి స్పందన

మండల కేంద్రమైన సిఎస్ పురం నుంచి డిజి పేటకు వెళ్లే రహదారిలో రత్నం జూనియర్ కాలేజీ వద్దకు చేరి నిల్వ ఉంటున్న మురుగు నీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. రత్నం జూనియర్ కాలేజ్ ఎదుట మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'రహదారిపై నీరు.. రాకపోకలకు ఇక్కట్లు' అంటూ శనివారం ప్రజాశక్తిలో కథనం ప్రచురించడంతో అధికారులు స్పందించారు. మైదుకూరు సింగరాయకొండ నేషనల్ హైవే రోడ్డు పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ఆదివారం మురుగు నీరు నిల్వ ఉన్న గుంటలలో గ్రావెల్ తోలించి, రోడ్డుపై నీరు చేరకుండా సైడ్ కాలువ తీయించి సమస్యను పరిష్కరించారు. పత్రికలో వార్త రావడం ద్వారా మురుగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ప్రజాశక్తికి వాహనదారులు, పాదచారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తాం: ఏడీఏ నీరజ

ప్రజాశక్తి కథనానికి స్పందన



కె నీరజ, ఏడీఏ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి దినపత్రికలో ఆదివారం 'నకిలీ వి(ప)త్తు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దానికి యర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాల కులు కె నీరజ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడతామని అన్నారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లో అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. లూజు విత్తనాలు ఎట్టి పరిస్థితిలో కొనుగోలు చేయరాదని సూచించారు. సరైన ప్యాకింగ్, లేబుల్ లేని, గడువు ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయరాదని చెప్పారు. అధీకృత డీలర్ల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. ఆ రసీదును పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని తెలిపారు. ప్రతి మండల వ్యవసాయ అధికారి వారి మండల పరిధిలో వచ్చిన విత్తనాల నమూనాలను తీసి నాణ్యతా పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపుతారని తెలిపారు. అంతేకాకుండా సహాయ వ్యవసాయ సంచాలకుల వారి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసి ఖరీఫ్‌లో మూడు సార్లు, రబీలో రెండు సార్లు ప్రతి విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు నకిలీ విత్తనాలు రాకుండా, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరైనా లైసెన్సు లేకుండా విత్తనాలు విక్రయించే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. అటువంటి వ్యక్తులు ఎవరైనా తారసపడితే వెంటనే సంబంధిత రైతు భరోసా సిబ్బందికి గాని, మండల వ్యవసాయ అధికారి వారికి గాని తెలియజేయాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

ప్రజలకు రుణపడి ఉంటా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: యర్రగొండపాలెం నియోజకవర్గంలో విపత్కర పరిస్థితులలో కూడా పెద్దఎత్తున అండగా నిలబడి ఎమ్మెల్యేగా నా గెలుపునకు కృషి చేసిన వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు రుణపడి ఉంటానని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం యర్రగొండపాలెం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహంతో పాటు జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలని అన్నారు. కానీ కొంతమంది టిడిపి నాయకులు, కార్యకర్తలు గొడవలు, వివాదాలు సృష్టించడం సరైన విధానం కాదన్నారు. ప్రజల మద్దతును పొందిన ప్రభుత్వం ప్రజలను కాపాడే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. కావాలని ప్రజల మధ్య చిచ్చుపెట్టే కార్యక్రమాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చెయ్యడం సరికాదన్నారు. బొమ్మలను ధ్వంసం చేయడం, నియమాలను, నిబంధనలను పాటించకుండా పేర్లను రాసుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా అభివర్ణించారు. తాము కూడా ప్రభుత్వానికి సహకరిస్తామని, యర్రగొండపాలెం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొంతా కిరణ్ గౌడ్, పుల్లలచెరువు జడ్పిటిసి వాగ్యా నాయక్, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, పట్టణ కన్వీనర్ జబివుల్లా, నర్రెడ్డి వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, నోముల శ్రీనివాస్, హరిబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

---

15 లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-దర్శి

దర్శి ఆదర్శ పాఠశాలలో చేరే విద్యార్థులు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్‌కె హసీనాబాను ఆదివారం తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9 తరగతులలో మిగిలిపోయిన సీట్ల కోసం నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 15వ తేదీన ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యార్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఖాళీ అయిన రిజర్వేషన్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు.

తాళ్లూరు ఎస్‌ఐగా విజయకుమార్

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు ఎస్‌ఐగా కె విజయకుమార్ బాధ్యతలు శనివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వైవి రమణయ్య సీఐగా పదోన్నతి రావడంతో ఆయన బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో విజయకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐని పలువురు కలిసి అభినందనలు తెలిపారు.



ఆర్‌టిసి బస్సులకు ఆదివారం సెలవు

ప్రజాశక్తి - పంగులూరు

ఆర్టీసీ అధికారులు ఇష్టారాజ్యంగా పనిచేస్తున్నారు. ప్రజల సౌకర్యార్థం నడపాల్సిన బస్సులను వారి ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారు. ప్రజల సౌకర్యం కోసం అవసరమైన రీతిలో బస్సులు నడపడంలేదు. ఆ రూట్లలో ఆర్టీసీ బస్సులకు సెలవు ఇవ్వడం ఆర్టీసీ అధికారులకు పరిపాటిగా మారింది. గ్రామీణ ప్రాంతంలో ప్రజలు అనేక అవసరాల కోసం ఆర్టీసీ బస్సులపై ఆధారపడి ప్రయాణం చేస్తుంటారు. అయితే ఆర్టీసీ అధికారులు ఇష్టం వచ్చిన రీతిలో నడపటం వల్ల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. అసలే అరకొరగా నడుస్తున్న ఆర్టీసీ బస్సులను ఆదివారం వస్తే కొన్ని రూట్లలో ఆపేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రయాణికులు ప్రైవేటు వాహనాలపై ఆధార పడాల్సి వస్తుంది. దూర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు చేరుకోవలసిన ప్రయాణికులు ఆదివారం ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో నానా యాతన పడుతున్నారు. అద్దంకి ఆర్టీసీ డిపో పరిధిలో మైలవరం, మక్కినేనివారి పాలెం, బాపట్ల, తాళ్లూరు, చీరాల, రావినూతల, అద్దంకి నుండి అంబటిపూడి మీదగా వెళ్లే చిలకలూరిపేట బస్సు, అద్దంకి నుండి వైదన మీదుగా చిలకలూరిపేట వెళ్లే బస్సులను అధికారులు ప్రతి ఆదివారం నిలిపి వేస్తున్నారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణించే ఈ బస్సుల్లో వ్యవసాయ కూలీలు నిత్యం పనులకు ఈ బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. ఈ బస్సుల్లో దూరప్రాంతాలకు వెళుతుంటారు. ఆదివారం రోజు బస్సులు లేకపోవడం వలన కూలి పనులు వెళ్లలేకపోతున్నారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణిస్తే అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గత



వివిధ రూట్లలో ఆదివారం నడవని ఆర్టీసీ బస్సులు

ఏడాది పంగులూరు మండలంలోని జాగర్లమూడి వారిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు తాళ్లూరు ప్రాంతానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురై ఇద్దరు మహిళా కూలీలు మరణించారు. అంతకు ముందు రెండు రోజుల క్రితం అద్దంకి మండలంలోని కలవకూరు సమీపంలో కూలీల ఆటో తిరగబడి ఒక మహిళ మరణించింది. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తూ కూలీలు అనేక సందర్భాల్లో మరణించడం, గాయాల పాలవడం జరుగుతుంది. ఆర్టీసీ బస్సులు సకాలంలో ఉంటే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండటంతో పాటు ఎలాంటి ప్రమాదాలు కూడా జరగకుండా నివారించ వచ్చని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తక్షణమే రద్దు చేసిన ఏడు బస్సులను పునరుద్ధరించి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిపై నీరు.. రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రెండు, మూడు గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న పెదలంక మధ్య గూడెం రహదారి నిరంతరం నీటితో నిండిపోయి బురద మయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తుంది. మండలంలోని పెదలంక మధ్య గూడెంలో మండల పరిషత్తు పాఠశాల గేటుకు ఎదురుగా రహదారి పూర్తిగా పల్లం కావడంతో వర్షం పడకపోయినా గ్రామంలో వాడుక నీరు రహదారిపైకి వచ్చి నిరంతరం బురదమయంగా మారుతుంది. దీంతో పాఠశాల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది. పాఠశాల్లోపలకు వెళ్లడానికి పల్లపు ప్రాంతంగా ఉన్న ఈ బురదలో నుండే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 20ఏళ్ల క్రితం నిర్మించిన ఈ సిసి రహదారికి ఇరువైపులా గ్రామస్తులు మెరకలు తోలు కోవటంతో రహదారి పల్లంగా మారింది. ఈ రహదారి గుండా కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామస్తులు, చల్లపల్లి మండలం ఆముదాలంక గ్రామస్తులు పెదలంక నుండి రేపల్లెకు వెళ్లేందుకు ప్రధాన రహదారి. ఈ గ్రామాల నుండి పెసర్లంక జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు కూడా ఇదే రహదారి ప్రధాన రహదారి. ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఈ బురదలోనే సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీని కారణంగా బురద చింది బ్యాగులు, పుస్తకాలు, బట్టలపై పడుతూ తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈపాటికే లంక గ్రామాల్లోని రహదారులు పూర్తిగా దెబ్బతిని గుంటలు ఏర్పడి ప్రజలు ఇబ్బంది కరంగా మారగా మజ్జిగూడ సమీపంలో వర్షం పడకపోయినా


రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో తిరుగుతున్న ప్రయాణికులు

నిరంతరం నీరు నిలబడే బురదగా మారటం పట్ల ఇప్పటివరకు సంబంధిత పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ బురద ప్రాంతమే మూడు మండలాలకు కూడలి

పెదలంక, మధ్యగూడెం పాఠశాల సమీపంలో పల్లపు ప్రాంతంగా మారిన ఈ రహదారి మూడు మండలాల ప్రాంతానికి సంబంధించినది కావటం విశేషం. ఈ బురద రహదారి సమీపంలో భట్టిప్రోలు, కొల్లూరు, చల్లపల్లి మండలాలకు ప్రధాన రోడ్డు కావటంతో ఎవరికి వారు తమకు ఎందుకులే అనే భావనతో పట్టించుకోవటం లేదని అక్కడ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈపాటికే గత నాలుగేళ్ళుగా ఈ రహదారిపై నీరు నిలబడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వ పాలనలో అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను గుర్తించి ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరి వేసుకుని బీహార్ యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మేదరమెట్ల

మండలంలోని తిమ్మనపాలెం గ్రామంలో బీహార్ రాష్ట్రానికి చెందిన యువకుడు గౌతమ్ కుమార్ (22) అద్దె ఇంట్లో ఫ్యానుకు విరేసుకొని ఆదివారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన వెలుగు చూసింది. మృతుడు బీహార్ రాష్ట్రం బేగుసరాయి జిల్లా బెనార గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ప్రక్కనే ఉన్న గ్రోత్ సెంటర్లో ఒక గ్రానైట్ ఫ్యాక్టరీలో పాలిష్ కూలీగా పనిచేస్తూ ఉంటాడు. మృతదేహాన్ని మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గౌతమ్ కుమార్ మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


మొక్కులు తీర్చుకుంటున్న నాయకులు

టిడిపి నేతల దైవదర్శనం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రాష్ట్రంలో టిడిపి గెలుపొందటమే కాక వేమూరు ఎంఎల్‌ఎగా నక్క ఆనందబాబు విజయం సాధించాలని కోరుతూ ఎన్నికల ముందు చేసుకున్న మొక్కులను ఎన్నికల అనంతరం ఆదివారం వివిధ గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు తీర్చుకున్నారు. అద్దేపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం విశ్వనాధపల్లికి వెళ్లి సంబరాలు జరుపుకున్నారు. నాంచారమ్మ గుడిలో మొక్కులు తీర్చుకున్నారు. పైలవరం గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో గ్రామ దేవత జొన్నాదుల రేడంకమ్మ, పైడమ్మ దేవస్థానంలో ముక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, వారి మిత్ర బృందం, మాచర్ల నాగరాజు, దీపాల ప్రసాదు, బూదాటి నాంచారయ్య పాల్గొన్నారు.


తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రార్ధన చేస్తున్న నాయకులు

కొల్లూరు : ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి 164సీట్లుతో విజయబేరి మోగించిన సందర్భంగా మండలంలోని ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చ్, తెలుగు బాప్టిస్ట్ చర్చిలో 101 కొబ్బరికాయలు కొట్టి టిడిపి నాయకులు ఆదివారం తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, గోరిగిపూడి ఏబేలు, కె రాధ, కనపాల బాబురావు పాల్గొన్నారు.


హనుమాన్‌ను దర్శించుకున్న టిడిపి కార్యకర్తలు

పర్చూరు : వైసిపి గద్దె దిగాలని నవ్యాంధ్ర రూపకర్త చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అభివృద్ధి ప్రదాత ఏలూరు సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించాలన్న కోరికలు తీరటంతో జాగర్లమూడి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు ధూళిపల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో మహిళలు పాదయాత్ర చేపట్టారు. ఆ గ్రామం నుంచి పాదయాత్రగా పర్చూరు వై జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయానికి చేరుకొని 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసిపి నుంచి విముక్తి కలిగించాలన్న కోరిక తీరిన నేపథ్యంలో ముక్కు తీర్చుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొల్లా శ్రీనివాసరావు, అడ్డగడ రామకృష్ణ, ఎడ్ల సాంబయ్య, కక్కెర వెంకట శివ, బుల్లెట్ శ్రీను, అడ్డగడ వెంకటేశ్వర్లు, షేక్ గౌస్, షేక్ బషీర్, హటాన్ బాజీ పాల్గొన్నారు. జాగర్లమూడికి చెందిన దివ్యాంగులు ట్రై సైకిల్‌పై వచ్చి అభయాంజనేయ స్వామిని దర్శించుకుని అభిమానాన్ని చాటుకున్నారు.


ఐలవరం దళితవాడ వాసులతో ఆనందబాబు

ఆనందబాబుకు అభినందనలు

ప్రజాశక్తి - వేమూరు

ఎంఎల్‌ఎ నక్కా ఆనందబాబును కలిసి టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం అభినందనలు తెలిపారు. ఓట్ల లెక్కింపు జరిగినప్పటి నుండి ప్రతిరోజు ఆనందబాబు క్యాంపు కార్యాలయానికి వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఐలవరం దళితవాడ నుండి వందమందికిపై కార్యాలయానికి వెళ్లి ఆనందబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కొల్లూరు, వేమురు, అమృతలూరు మండలాల నుండి వందల సంఖ్యలో కార్యకర్తలు తరలి వస్తున్నారు. భోజన విరామ సమయం కూడా ఇవ్వకుండా కార్యకర్తలు ఆనందబాబు కార్యాలయానికి వరుస కడుతున్నారు.



రామోజిరావుకు నివాళి అర్పిస్తున్న నాయకులు

రామోజీరావుకు నందమూరి కళాపరిషత్ నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

అక్షర యోధుడు రామోజిరావుకు నందమూరి కళా పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు. నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన సభలో రిటైర్డ్ ఆర్జెడి, జానపద కళా పీఠం అధ్యక్షులు ఉబ్బా దేవపాలన మాట్లాడుతూ వేలమంది సైన్యం కంటే పత్రిక పవర్ ఎక్కువని, సంపాదకీయ రంగంలో రాజుగా వెలుగొందిన రామోజీ రావు జీవితాన్ని, ఆయన భావాలను చదివితే అర్థమవుతుందని అన్నారు. సంపాదకీయంలోనే కాక సినీ రంగంలో లక్షలాది మందికి ఉపాధినిస్తున్న రామాజీరావు అక్షరం ఉన్నంత కాలం ప్రజల హృదయాల్లో బ్రతికే ఉంటారని అన్నారు. మన్నె రామారావు మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించి జీవితంలో ఎన్నో ఒడి దుడుకులు ఎదురైనా నిరాడంబరతో ఎదుర్కొనే వ్యక్తి, సామాజిక హితంగా ముందుకు వెళ్లే వ్యక్తి అని అన్నారు. వ్యవస్థ లోపాలను చీల్చి చెండాడే చండశాసనుడని అన్నారు. అలాంటి వ్యక్తిని మనం మరలా చూడబో మని అన్నారు. నాగనేని రామకృష్ణ, జ్యోతి చంద్రమౌళి, అన్నమనేని వెంకటరావు, గాడేపల్లి దివాకర దత్తు, చెన్నుపాటి రామాంజనేయులు, సంధిరెడ్డి శ్రీనివా సరావు, ధూళిపాళ్ల వీరనారాయణ, మలాది శ్రీనివాస రావు, పిసిహెచ్ కోటయ్య, నర్రా గోపాల్, దామా హను మంతరావు, నాదెండ్ల సుబ్బారావు, ఎస్‌కె మాబు, పిఎస్ ఆర్ ఆంజనేయులు, చేబ్రోలు వెంకటసుబ్బయ్య, గోవాడ శ్రీకాంత్, చెన్నుపల్లి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గాయాలు

ప్రజాశక్తి - బాపట్ల

స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున రైలు నుండి ప్రమాద వశాత్తు జారిపడి యువకుడికి రెండు కాళ్లు తెగిపోయాయి. స్థానికులు గుర్తించి 108 వాహనంకు సమాచారం ఇవ్వడంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ప్రమాదానికి గురైన వ్యక్తి బాపట్ల పట్టణం శారదాపురి కాలనీ చెందిన షేక్ సైదాగా గుర్తించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

కర్రసాము కళను పరిరక్షించాలి

కనుమరుగవుతున్న ప్రాచీన కర్ర సాము కళ

ప్రజాశక్తి - బాపట్ల

పూర్వకాలంలో యుద్ధ కళల్లో ఒకటైన కర్రసాము నానాటికి అంతరించిపోతోంది. క్రీస్తు పూర్వం పుట్టిన కర్ర సాము కళను నేటి పాలకులు పట్టించుకోవడం లేదు. క్రీడల్లో భాగమైన కర్రసాము కళను రేపటి తరానికి అందించాల్సిన అవసరాన్ని గుర్తించి కర్ర సామును పరిరక్షించి, ముందు తరాలకు అందించేందుకు సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు కర్రసాము పట్ల ఆసక్తిని పెంచేందుకు స్థానిక రైలుపేట కృష్ణ మందిరం వద్ద కర్ర సాము శిక్షణ ప్రారంభించారు. ఫౌండేషన్ ప్రతినిధులు వెంకట భట్టు, కొలను మోహన్, పూసపాటి శ్రీకాంత్ పర్యవేక్షణలో కర్ర సాము శిక్షకుడు కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన కందుల శివరాం ద్వారా చిన్నారులకు కర్ర సాములో శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల సెలవుల్లో విద్యార్థులు, చిన్నారులకు కర్ర సాము పట్ల ఆసక్తి కల్పించేందుకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాపట్లలో శిక్షణ నిరంతరం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. స్థానిక ఎయిమ్ సదన్ వసతి గృహంలో అనాథ చిన్నారులకు ఉదయం, సాయంత్రం సమయాల్లో కర్ర సాము శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆసక్తి గల విద్యార్థులకు కర్ర సాము నేర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. కర్ర సాముశిక్షణ ఇస్తున్న కందుల శివరాం తాతల కాలం నుండి వంశ పారంపర్యంగా కర్ర సాము విద్య నేర్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కర్ర సాముశిక్షకుడు శివరాం మాట్లాడారు. క్రీస్తు పూర్వమే కర్రసాము విద్య పుట్టిందని తెలిపారు.



కర్ర సాము విద్యార్థులతో శిక్షకుడు, నిర్వాహకులు

అప్పటి జీవన విధానం, అందుబాటులోని వనరుల ఆధారంగా శత్రువుల నుండి ఆత్మ రక్షణకు తమిళనాడులో కర్ర సాము పురుడు పోసుకుందని తెలిపారు. తమిళనాడులో అంకురించిన సంప్రదాయ కర్రసాము ప్రపంచ వ్యాప్తంగా పరిచయమైందని తెలిపారు. తమిళంలో దీన్ని 'సిలంబం' అని, తెలుగులో 'తాలింకానా' అని పిలిచేవారని తమ తాతలు చెప్పేవారని అన్నారు. కర్రలతో చేసే సాధనం కావడంతో కొన్నేళ్ల తరువాత 'కర్రసాము'గా తెలుగులో ప్రసిద్ధి కెక్కిందని తెలిపారు. కాలక్రమేణా కర్ర సాముకు యుద్ధ ప్రాముఖ్యత తగ్గిపోయిందని అన్నారు. నేటికీ ఈ కళ కొన్ని గ్రామాల్లో సజీవంగా ఉన్నప్పటికీ ప్రాధాన్యత లేకుండా పోయిందని పేర్కొన్నారు. అయితే నగర యువతకు ఈ విద్య గురించి పూర్తిగా అవగాహన లేదని అన్నారు. రేయింబవళ్లు పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులు అనేక ప్రాచీన కళలను విస్మరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కర్రసాము ఔన్నత్యాన్ని పట్టణ, నగర యువతకు అవగాహన, ఆసక్తి కల్పించేందుకు కర్రసాము పేరుతో క్రీడా పోటీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే బాపట్లలో సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్రసాము విద్యను విద్యార్థులు, చిన్నారులకు నేర్పిస్తున్నామని తెలిపారు. కర్రసాము సాధనతో ఆత్మరక్షణతో పాటు అధిక బరువు తగ్గడానికి, మడమలు, కీళ్ళు, ఎముకల పటుత్వానికి, శరీరంలో రక్త ప్రసరణ సజావుగా సాగేందుకు, ఏకాగ్రత పెంచేందుకు కర్ర సాము విద్య ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కర్ర సాము కళను పరిరక్షించేందుకు ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి కర్ర సాము కళను ప్రోత్సహించాలని కోరారు. ఇదే కళను నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమ లాంటి వారికి ఉపాధి సమకూరుతుందని అన్నారు.



కర్ర సాము శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అధికారం మార్పుతో అభివృద్ధి జరిగేనా.?

◆ దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న పొదిలి చెరువుకు సాగర్ జలాల మళ్లింపు ◆ పట్టణాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే



పొదిలిలో ప్రతినిత్యం మంచినీటి కోసం కుస్తీలు పడుతున్న వైనం

ప్రజాశక్తి - పొదిలి

సుమారు దశాబ్ద కాలంపైగా పొదిలి ప్రాంతంలో ఎటువంటి అభివద్ధి ఆనవాళ్లు లేవు. తాజాగా మారిన రాజకీయ పరిణామాలతో నూతన ప్రభుత్వంలోనైనా ఈ ప్రాంతం అభివద్ధికి అంకురార్పణ జరిగేనాని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో భౌగోళికంగా జిల్లాకు కేంద్రమైన పొదిలి పట్టణం అభివద్ధి పరంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. పొదిలి పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు మంచినీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎన్ఎపి సాగర్ నీటి పథకం పెరిగిన జనాభాకు అనుగుణంగా విస్తరణకు నోచుకోక పోవడంతో ప్రజలు మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకం కింద గ్రామాలకు సైతం మంచినీరు సరిగా అందక ప్రజలు ఫ్లోరైడ్ నీటినే తాగుతున్నారు. పొదిలి కేంద్రంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లేకపోవడంతో దర్శి నుండి వస్తున్న ఈ సాగర్ నీటి కోసం పొదిలి పట్టణంలో ఎన్ఎపి సంపు వద్ద ప్రతిరోజూ ప్రజలు క్యూ కడుతున్నారు. పొదిలి ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2009 ఎన్నికల్లో దర్శి సాగర్ కాలవ నుండి పొదిలి పెద్ద చెరువుకు నీటి మళ్లింపు పథకం ప్రతిపాదన ముందుకు వచ్చింది. 2009లో రెండవసారి ముఖ్యమంత్రి అయిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం ఆయన మరణంతో పనుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. తర్వాత రాష్ట్ర రాజకీయ పరిణామాలతో ఈ అంశం మరుగున పడింది. రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం నూతన రాష్ట్ర రాజధాని ఏర్పాటు ఇతర అంశాలతో ఈ పథకాన్ని పక్కనపెట్టారు. అప్పటికే పొదిలి పట్టణంలో ప్రతి వార్డులోనూ ట్యాంకర్లతోనే నీటి సరఫరా జరుగుతూ ఉండడంతో పాటు టిడిపి ప్రభుత్వ పనితీరుకు వ్యతిరేకంగా సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న జంకె వెంకటరెడ్డి పొదిలి పెద్ద చెరువుకు సాగర్ జలాల మళ్లింపు కోరుతూ స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్లో దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజల్లో మంచి స్పందన లభించింది. అప్పటి టిడిపి ప్రభుత్వం ఆగమేఘాలమీద ఈ పథకం మంజూరు చేస్తునట్లు ప్రకటించింది. అప్పటి పార్లమెంట్ సభ్యులుగా ఉన్న వైవి సుబ్బారెడ్డి సైతం తాము అధికారం లోకి వచ్చిన వెంటనే పొదిలి ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ పథకాన్ని మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వైసిపి నాయకుల ధర్నాను, వై సుబ్బారెడ్డి మాటలను పెద్దగా పట్టించుకోని టిడిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా 2018లో పొదిలికి వచ్చిన జగన్మోహన్ రెడ్డి చిన్న బస్టాండ్ సెంటర్‌లో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పొదిలి పెద్ద చెరువును సాగర్ జలాలతో నింపుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల నాటికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న జంకె వెంకటరెడ్డిని మార్చి కెపి కొండారెడ్డి కుమారుడు కుందూరు నాగార్జునరెడ్డికి అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో పొదిలి పట్టణంలో ప్రజలు తమకు మంచినీరు కావాలి అంటూ ప్లకార్డులతో వైసిపి నాయకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో పొదిలి పట్టణంతో పాటు మండల ప్రజలు 7000 పైచిలుకు భారీ మెజార్టీతో నాగార్జునరెడ్డికి పట్టం కట్టారు. తర్వాత జరిగిన పరిణామాల్లో అభివద్ధి సంక్షేమం అనే అంశంలో సంక్షేమానికి పెద్ద పీట వేసిన ప్రభుత్వం అభివద్ధిని గాలికి వదిలేసింది. ఎన్నికలకు ఏడాది ముందు హడావుడిగా పథకం మంజూరు చేసి రూ.50 కోట్లు పరిపాలన అనుమతి ఇచ్చింది. అప్పటికే విసిగి వేసారి పోయిన ప్రజలు సకాలంలో పథకం పూర్తై మంచినీళ్లు వస్తాయనే నమ్మకం కోల్పోయారు. అప్పటి వరకు పొదిలి పట్టణానికి దర్శి నుంచి వస్తున్న నీళ్లు కూడా సరిగా రాకపోవడంతో వైసీపీ ప్రభుత్వంపై ప్రజల ఆశలు సన్నగిల్లాయి. దీనికి తోడు పొదిలి పట్టణ అభివద్ధికి సంబంధించి రూ.11కోట్లతో రహదారులు విస్తరణ, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన వాటికి దిక్కే లేకుండా పోయింది. ఒకవైపు మంచినీటి సమస్య మరోవైపు పట్టణ అభివద్ధి లేక ప్రజలు మురుగు నీటితో సహవాసం చేస్తూ రోడ్లపైన నానా అవస్థలు పడ్డారు. పట్టణ అభివద్ధి కోసం అవసరమైన అనేక సమస్యలున్న ప్రజల ముఖ్యంగా మంచినీరు, మౌలిక వసతుల విషయంలో రాజీ పడలేక తాము ఏరి కోరి ఎంచుకున్న ప్రభుత్వాన్ని నిందించలేక, రాజకీయ నాయకులను నిలదీయలేక నివురు కప్పిన నిప్పులా ఒక్కసారిగా ఎన్నికల్లో తమ ప్రతాపం చూపించారు. గతంలో వైసిపికి పట్టణంతో సహా 7500 మెజార్టీ రాగా దాన్ని తలదన్ని పట్టణ ప్రజలు సొంతంగా 2,300కుపైగా మెజార్టీ టిడిపికి కట్టబెట్టారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు పట్టణంలో అభివద్ధి విషయంలో మంచినీరు, రహదారుల విస్తరణ కీలకంగా మారాయి. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన టిడిపి ప్రభుత్వం ఈ విషయాలను సీరియస్‌గా తీసుకొని మొదటి ప్రాధాన్యత అంశాలలో మంచినీటి పథకం పనులు, పట్టణ రహదారి విస్తరణకు నిధులు విడుదల చేసి త్వరగా పనులు ప్రారంభిస్తేనే టీడీపీపై ప్రజలకు మరోసారి నమ్మకం కలిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికలకు రెండు రోజుల ముందు పొదిలి పట్టణానికి విచ్చేసిన తాజా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పొదిలి ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటారో, గతంలో మాదిరిగా కాలయాపన చేస్తూ పొదిలి ప్రజల కష్టాలను చూస్తారో వేచి చూడాలి.



డ్రైనేజిలేక, రహదారి విస్తరణకు నోచుకోక అవస్థలు పడుతున్న ప్రజలు




ఎమ్మెల్యే స్వామిని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎమ్మెల్యే స్వామికి సన్మానం

ప్రజాశక్తి - పొదిలి

కొండపి ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయ స్వామి గెలుపుకు ఎమ్మార్పీఎస్ ఎంతో కషి చేసిందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి తోరటి ఆనంద్ మాదిగ అన్నారు. తూర్పు నాయుడుపాలెం గ్రామంలోని ఎమ్మెల్యే స్వామి స్వగృహంలో ఎంఆర్పిఎస్ క్యాడర్‌తో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాన్యశ్రీ మందకష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులు గెలుపుకు ఎమ్మార్పీఎస్ కీలకపాత్ర పోషించిందని ఎన్డీఏ గెలుపు మాదిగల గెలుపనే నినాదంతో అహర్నిశలు కషి చేశామని అన్నారు. మాదిగ జాతి లక్ష్యం ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడమేనని ప్రకాశం జిల్లా జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షులు గురజాల నరసింహారావు మాదిగ అన్నారు. మహాజ సోషలిస్ట్ పార్టీ ఇంచార్జ్ పూనూరి క్రిస్టఫర్ మాదిగ మాట్లాడుతూ మాదిగ జాతి భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులు తమ వంతు సహకారాన్ని అందించి మాదిగ జాతి లక్ష్యం సాధించుకునే దిశగా తమ సహకారం అందించాలని కోరారు. స్వామిని కలిసిన వారిలో ఎంఆర్పిఎస్ నాయకులు గోచిపాతల తిరుపాలు, పంది ప్రభుదాసు, దేవరపల్లి సంజీవ్ కుమార్, మన్నం రాజేష్, రావినూతల బ్రహ్మయ్య, దావులూరి రాంబాబు, నరసింహం, గోసిపాతల చిట్టిబాబు, యిర్మియా, ఆదాము, అనిల్ పాల్గొన్నారు.



అదుపుతప్పి బోల్తాపడ్డ బియ్యం లారీ

బియ్యం లారీ అదుపుతప్పి బోల్తా

ప్రజాశక్తి - కొమరోలు

మండలంలోని తిమ్మారెడ్డిపల్లె సమీపంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో కడప నుండి గుంటూరువైపు వెళుతున్న బియ్యం లారీ అమరావతి, కడప రాష్ట్రీయ రహదారిపై బియ్యం లోడుతో వెళ్తు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పొలాల్లో బోల్తా పడింది. లారీ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలు అయ్యాయి.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-దర్శి



మేడా హనుమంతరావు

దర్శిలోని అభి షాపింగ్ మాల్ అధినేత శనివారం ఉదయం నుంచి కనిపించడం లేదని భార్య సుభాషిని పిర్యాదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. 8న గుంటూరు వెళ్లి అక్కడ నుండి బెంగళూరుకు వెళ్తానని చెప్పి 9న ఉదయం 11 గంటల నుండి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని, ఎక్కడికెళ్ళిందో తెలియదని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కారణాలు తెలియ రావాల్సి ఉందన్నారు.

రాజ్యాంగ నిర్వీర్యాన్ని అడ్డుకోవాలి

గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుమ్మడి సూర్యకిరణ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటున్న బిజెపి కార్యాచరణను టిడిపి, జనసేన పార్టీలు అడ్డుకోవాలని ప్రజా యుద్ధనౌక గద్దర్ కుమారుడు, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుమ్మడి సూర్య కిరణ్ డిమాండ్ చేశారు. ఒంగోలు ప్రెస్ క్లబ్ లో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో సూర్య కిరణ్ మాట్లాడారు. మోడీ ప్రధాని అయ్యాక రాజ్యాంగానికి, తద్వారా దేశ ప్రజలకు ప్రమాదం పొంచి ఉందని గుర్తించిన తన తండ్రి గద్దర్ కాన్స్టిట్యూషన్ - సేవ్ ఇండియా పేరుతో ప్రతి పల్లెకు తిరిగి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారన్నారు. ప్రజాస్వామిక వాదులు, విద్యావంతులు, మేధావులు, ప్రజా సంఘాలను కలసి రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు మద్దతు కూడగట్టారన్నారు. 2024 ఎన్నికల్లో బిజెపికి ఒంటరిగా 400 పార్లమెంట్ సీట్లు దక్కితే రాజ్యాంగాన్ని, మనిషిని మనిషిగా చూడని మను ధర్మ శాస్త్రానికి జెరాక్స్ కాపీగా రూపొందించేవారన్నారు. బిజెపికి ఆశించిన సీట్లు రాక టిడిపి, జనసేన వంటి ప్రాంతీయ పార్టీల మద్దతుతో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో, సెక్యులర్ పార్టీలని చెప్పుకుంటున్న టిడిపి జనసేన ప్రాంతీయ పార్టీలు రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడాలన్నారు. బిజెపి చర్యలకు అడ్డుగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు చప్పిడి వెంగళరావు, మాల మహానాడు అధ్యక్షులు దారా అంజయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుమ్మడి సూర్యకిరణ్


ఎమ్మెల్యే స్వామితో యుటిఎఫ్ నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి : స్వామి

ప్రజాశక్తి- టంగుటూరు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఎమ్మెల్యే స్వామిని తూర్పునాయుడుపాలెంలోని ఆయన నివాస గృహంలో టంగుటూరు, జరుగుమల్లి మండలాల యుటిఎఫ్ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అంజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావాల్సిన డిఎలు, పిఆర్‌సిఅరియర్స్, నూతన పిఆర్‌సి జీవో, 117 రద్దు గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో దామచర్ల శ్రీధర్ బాబు, కాట్రగడ్డ రమేష్, టి. శేషయ్య, పుట్టా వెంకట్రావు, కె. పూర్ణశ్రీ, కె.రమేష్, ఎం. సురేష్, పి. రాజసులోచన, కె. రఘూన్సీ, ఎస్. ప్రసాద్, ఎస్‌కె.మస్తాన్, రాము,. శ్రీను, నారాయణ, ్.బ్రహ్మయ్య సుబ్బనాచారి, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వామికి అభినందనలు

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని తూర్పు నాయుడుపాలెంలోని ఆయన నివాసంలో వివిధ గ్రామాల నాయకులు కలిసి అభినందనలు అభినందనలు తెలిపారు. పూలమాలలతో సత్కరించారు. ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపిన వారిలోరావూరి సోదరులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు కామని నాగ శ్రీను, కామని వెంకట్రావు. టంగుటూరు ఉప సర్పంచి కొత్తపల్లి నర్సయ్య, ముప్పరాజు వెంకట్రావు, కామని శ్రీను, రజనీకాంత్, సుదర్శన్, మనోజ్ ఉన్నారు.

కంప్యూటర్ ప్రోగ్రామింగ్ స్కిల్స్ తప్పనిసరి

ఎక్సెల్ సొల్యూషన్ సిఇఒ డాక్టర్ రవికుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కంప్యూటర్ ప్రోగ్రామింగ్ స్కిల్స్ తప్పనిసరిగా నేర్చుకోవాలని ఎక్సెల్ సొల్యూషన్ సిఇఒ డాక్టర్ రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక అంజయ్య రోడ్‌లోని బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ఆవరణలో ఇంజినీరింగ్ కళా శాలల్లో చేరబోతున్న విద్యార్థులకు ఫ్రీ ఆస్క్ వర్క్‌షాప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ రాబోయే కాలంలో కంప్యూటర్ వినియోగం మరింతగా పెరుగు తుందన్నారు. అన్ని రంగాల్లో కంప్యూటర్ సేవలు తప్పనిసరి అవుతాయన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన మొదటి సంవత్సరం నుంచే కొత్త ప్రోగ్రామింగ్ సాఫ్ట్‌వేర్స్ నేర్చు కోవాలన్నారు. అప్పుడే క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగం సాధించ గలుగుతారన్నారు. ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ సీనియర్ డేటా అనలిస్ట్ బాలకష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ప్రోగ్రామింగ్ స్కిల్స్ బాగా నేర్చు కోవాలన్నారు.కష్టమని అనుకోకుండా ఇష్టంగా నేర్చుకోగలిగితే పెద్ద కంపెనీలలో మంచి ప్యాకేజితో ఉద్యోగాలు పొందవ చ్చన్నారు. నేర్చుకునే సమయంలో ఏకాగ్రత, కుదరకపోతే మెడిటేషన్ చేస్తే అన్ని సమస్యలు సులభంగా అధిగమించి విజయం సాధిస్తారన్నారు. బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత న్యామతుల్లా బాషా ఇంజినీరింగ్‌లో చేరబోతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ కంప్యూటర్స్ స్టాఫ్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

ఉత్సాహంగా కరాటే గ్రేడింగ్ టెస్ట్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక హైదరీక్లబ్‌లో నిర్వహించిన కరాటే గ్రేడింగ్ టెస్ట్ ఉత్సాహంగా సాగింది. సిద్దార్థ కరాటే అసోసియేషన్ సెక్రెటరీ నల్లూరి మోహనరావు(బ్లాక్‌బెల్ట్ 7వడాన్) చీఫ్ ఎగ్జామినర్‌గా ఈ గ్రేడింగ్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. గిద్దలూరు, కొత్తపట్నం, ఒంగోలుకు చెందిన 70 మంది విద్యార్థులు ఈ టెస్ట్ కు హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కరాటే చదువుతోపాటు ఆత్మ రక్షణకు, మనోధైర్యానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. టెస్ట్‌కు హాజరైన విద్యార్థులకు బెల్ట్స్, ధృవ పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షుడు గుండవరపు రాఘవ, సిద్దార్థ కరాటే అసోసియేషన్ ఎపి, తెలంగాణా అధ్యక్షుడు మండవ మురళీకష్ణ, ఉపాధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు, మండవ సుబ్బారావు. హైదరాబాద్ స్కూల్ కరస్పాండండెంట్ జగదీశ్, సూర్య స్కూల్స్ అధినేత వెంకటరామిరెడ్డి, కరాటే మాస్టర్స్ వెంకటేశ్వర్లు, అనిల్, సుబ్రహ్మణ్యం, రామకష్ణ, యస్వంత్ పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

రైతుల అభివృద్ధే ధ్యేయం

- వ్యవసాయ ప్రణాళిక రూపకల్పన
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- రూ.18,146 కోట్ల రుణాలు ఇచ్చేందుకు చర్యలు
- జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



రైతుల అభివృద్ధే ధ్యేయంగా తాము పనిచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. 2024 ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. వ్యవసాయ అధికారులు ద్వారా వ్యవసాయ ప్రణాళికను రూపొందిం చామన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలు, సబ్సిడీలను జిల్లా వ్యవసాయ అధికారి ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ మాటలల్లోనే....

గత ఏడాది ఖరీఫ్‌లో అనావృష్టి కారణంగా రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించారు. రబీలోనూ అదే పరిస్థితి పునరావృతమైంది. మాగాణి పంట వేసినా ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవటంతో రైతులు నిరాశ చెందారు.

ఖరీఫ్ లక్ష్యం 2.02 లక్షల హెక్టార్లు

జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 2,02,249 హెక్టార్లుగా నిర్ణయించాం. వరి 14,078 హెకార్లు, జొన్నలు 194, సజ్జలు 7125 హెక్టార్లు, మొక్కజొన్న 2464, రాగి 34 హెక్టార్లు, కొర్రలు 1373 హెక్టార్లు, మేజర్, మైనర్ మిల్లెట్లు 11,205 హెక్టార్లలో సాగు లక్ష్యంగా నిర్ణయించాం. పెసలు 1061 హెక్టార్లు, మినుములు 2520 హెక్టార్లు, కంది 73,003 హెక్టార్లు, అలసందలు 117 హెక్టార్లలో సాగు చేయాలని నిర్ణయించాం. వేరుశనగ 544 హెక్టార్లు, నువ్వులు 2790 హెక్టార్లు, ప్రొద్దు తిరుగుడు 161 హెక్టార్లు, ఆముదం 1723 హెక్టార్లు, సోయా బీన్ 21 హెక్టార్లు పత్తి 31,562 హెక్టార్లు, మిర్చి 23,873 హెక్టార్లు, పసుపు 358 హెక్టార్లు, టమోటా 653 హెక్టార్లు, పశుగ్రాసం 2863 హెక్టార్లు పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటి వరకు జిల్లాలో 585 హెక్టార్లలలో వివిధ పంటలు సాగయ్యాయి.

ముఖాముఖి

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ వద్ద సిద్ధంగా ఉన్నాయి. 57,647 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటి వరకు 38,055 మెట్రిక్ టనున్నలు సిద్ధంగా ఉన్నాయి. యూరియా 16,153 మెట్రిక్ టన్నులు కేటాయించగా. 9946 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి. డిఎపి 7352 మెట్రిక్ టన్నులు కేటాయించగా 2274 టన్నులు ఉన్నాయి. ఎంఒపి 951 మెట్రిక్ టన్నులు కేటాయించగా 762 టన్నులు సిద్ధంగా ఉన్నాయి. ఎస్ఎస్‌పి 3025 మెట్రిక్ టన్నులు కేటాయించగా 2023 టన్నులు సిద్ధంగా ఉన్నాయి. కాంప్లెక్స్ ఎరువులు 30,167 మెట్రిక్ టన్నులు కేటాయించగా 1432 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి.

రైతు భరోసా కేంద్రాలలో...

రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు 17,168 మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా 846,79 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి. యూరియా 6816 టన్నులు కాగా 52.69 టన్నులు అమ్మగా 253.44 టన్నులు సిద్ధంగా ఉన్నాయి. డిఎపి 2798 టన్నులు లక్ష్యం కాగా 255.6 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. ఎంఒపి 185 మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా 36.1 టన్నులు ఉన్నాయి. కాంప్లెక్స్ ఎరువులు 6944 మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా 321.5 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నాయి.

ఆశాజనకంగా వర్షాలు

జిల్లాలో ఖరీఫ్‌లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి రుతుపవనాల కారణంగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగు పనులు ముమ్మరం అయ్యాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం 57.8 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకు 45.1 మిల్లీమీటర్లు నమోదు అయ్యింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కొనసాగితే పూర్తి స్థాయిలో ఖరీఫ్ పంటలు పడే అవకాశం ఉంది.

పంట రుణాలు అందించేందుకు చర్యలు

రైతులను అవసరమైన పంట రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా స్థాయి బ్యాంకులు సంప్రదింపుల కమిటీ నిర్ణయం మేరకు రూ.18,146 కోట్ల రుణాలు రైతులకు ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం, పంట రుణాలు రూ.13,863 కోట్లు, రూ.4,283 కోట్ల టర్మ్ రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం. కౌలు రైతులకు రూ.513 కోట్ల రుణాలు ఇవ్వనున్నాం. సిసిఆర్‌సి కార్డులు 38,629 ఇచ్చాం.